
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
శుక్రవారం 17 మే 2024





కేయూ ప్రక్షాళన జరిగేనా?



- భూ ఆక్రమణలపై కమిటీ నివేదికకు చెదలు
- అక్రమార్కులను కాపాడుతున్నదెవరు?
- అర్ట్స్ కాలేజీలో రూ.5కోట్ల ఫీజుల స్కాం ఏమైందో!
- అనుబంధ అధ్యాపకుల నియామకంలో నిబంధనలు తూచ్
- ఉత్కంఠ రేపుతున్న పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విచారణ
- అధిక మెస్ బిల్లుల పేరుతో రూ.2.50కోట్లు కనుమరుగు
- ఫాం డీ కోర్సుల అనుమతుల్లో అక్రమాలపై కానరాని చర్యలు
- వీసీగా రమేష్ నియామకం నుంచే వివాదాలు మొదలు
- కేయూ ప్రక్షాళనపై సీఎం రేవంత్ ప్రకటనతో విద్యార్థులు, ప్రొఫెసర్లలో ఆశలు

వివాదాలకు కేరాఫ్‌గా కాకతీయ యూనివర్సిటీ

కబ్జాలు, అవినీతి, అక్రమాలతో కంపు కొడుతున్న కాకతీయ యూనివర్సిటీలో ప్రక్షాళన జరుగుతుందా? రూ.కోట్ల విలువైన కేయూ భూములు అన్యాక్రాంతంతో పాటు అధ్యాపకులు నియామకాల్లో అక్రమాలు, పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలపై విచారణ ముందుకు సాగుతుందా? మెస్ బిల్లులతో పాటు ఆర్ట్స్ కాలేజీ ఫీజుల నిధుల మాయ, ఫాం డీ అనుమతుల్లో అక్రమాలకు బాధ్యులపై చర్యలు ఉంటాయా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలే వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా గాడి తప్పిన కాకతీయ యూనివర్సిటీ పాలనను ప్రక్షాళన చేస్తానని సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటన విద్యార్థులు, అధ్యాపకుల్లో ఆశలు చిగురింపజేస్తోంది. ఈ నెలలో వీసీ రమేష్ పదవీకాలం ముగుస్తుండటంతో కొత్త పాలక మండలి నియామకంతో పాటు కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తుంద నే ప్రచారం జరుగుతోంది.

- వరంగల్, ఆంధ్రజ్యోతి ప్రతినిధి

7లో..

పార్లమెంట్ ఫలితాలపైనే.. స్థానిక ఆశలు

- మునిసిపల్, మండలం, గ్రామాల్లో ఓట్లు ఎటు?
- అసెంబ్లీ గాలి.. లోక్‌సభకు పనిచేసిందా? లేదా?
- బూత్‌లు, గ్రామాల వారీగా పోలింగ్‌పై మల్లగుల్లాలు
- పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల భవిత్యం ఈ ఫలితంతోనే
- పార్టీల నాయకుల్లో ఉత్కంఠ



మహబూబాబాద్, మే16 (ఆంధ్రజ్యోతి) : లోక్‌సభ ఎన్నికల్లో కీలకమైన పోలింగ్ ఘట్టం ముగిసింది. తుది అంకమైన కౌంటింగ్‌కు ఇంకా 18 రోజులు మిగిలి ఉంది. జూన్ 4న ఓట్ల లెక్కింపుతో ఏ పార్టీ మనుగడ ఏమిటనేది తేటతెల్లం కానుంది. కట్‌చేస్తే.. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపైనే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీల నుంచి పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల భవితవ్యం ఆధారపడి ఉంటుందనడం అతిశయోక్తి కాదు. అందుకే మహబూబాబాద్ లోక్‌సభకు పోటీ చేసిన అభ్యర్థులు, పార్టీల కంటే ఎక్కువగా మునిసిపాలిటీలు, మండలాలు, గ్రామాల్లోని వివిధ పార్టీల నాయకుల్లో తీవ్ర ఉత్కంఠత కన్పిస్తోంది. దశాబ్దకాలం తర్వాత ఇటీవల తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారం చేపట్టింది. ఈ ఎన్నికలు జరిగిన ఐదునెలల అనంతరం వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లోనూ విజయం సాధించే దిశగా.. ఆ పార్టీ అసెంబ్లీ జోష్‌తోనే ముందుకు సాగింది. అంతకుమునుపు తెలంగాణ సాధనతో రాష్ట్రంలో గులాబీ దళం వరుసగా రెండుసార్లు అధికారంలోకి వచ్చి స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే విజయాల పరంపరను కొనసాగించింది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన క్రమంలో పార్లమెంట్ ఎన్నికల్లోనూ యథారీతిన ప్రజలు ఆశీర్వదిస్తే ఇకపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మనుగడ సాగించవచ్చని ఆయా పార్టీ నాయకులు విశ్వసిస్తున్నారు.

పోలింగ్ సరళి.. ఓటర్ల తీరు..

మహబూబాబాద్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళి, ఓటర్ల అభిప్రాయాల తీరు ఆధారంగా ప్రధాన రాజకీయ పార్టీలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బలంచాటగల వివిధ పార్టీల నాయకులు గణాంకాలను ముందేసుకుని ఎవరి లెక్కల్లో వారు మునిగి తేలుతున్నారు. జిల్లాలో పూర్తిస్థాయి అసెంబ్లీ నియోజకవర్గాలైన మహబూబాబాద్, డోర్నకల్‌లలోని ఆయా మండలాల్లో పోలైన ఓట్లను పరిశీలిస్తూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ పార్టీకి ఏ స్థాయిలో బలం లభిస్తుందో అంచనా కట్టేందుకు ఇప్పట్నుంచే ఆయా మండలాల ముఖ్యనేతలు ప్రయత్నాలు ఆరంభించారు.

మహబూబాబాద్ నియోజకవర్గంలోని గూడూరు, ఇనుగుర్తి, కేసముద్రం, మహబూబాబాద్, నెల్లికుదురు, దంతాలపల్లి మండలంలోని రెండు పోలింగ్ కేంద్రాలు వెరసి 287 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,58,850 ఓట్లకు గాను 1,84,410 ఓట్లు పోలయ్యాయి. డోర్నకల్ నియోజక వర్గంలోని చిన్నగూడూరు, దంతాలపల్లి, డోర్నకల్, కురవి, మరిపెడ, నర్సింహులపేట, సీరోలు మండలాల పరిధిలోని 264 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,22,906 ఓట్లకు గాను 1,68,053 ఓట్లు పోలయ్యాయి. ఈ ఓట్లు ఏ మండలాల్లో ఏ పార్టీకి మెజార్టీ ఇచ్చాయి... అనే కోణంలో బూత్‌ల వారీగా లెక్కలు ముందేసుకుని ప్రధాన పార్టీల నాయకులు అంచనాలు వేయడం కోసం మల్లగుల్లాలు పడుతున్నారు.

మండలాల వారీగా ఓట్లు పరిశీలిస్తే..

మహబూబాబాద్ మండలంలో 1,04,506 ఓట్లకు గాను 70,796 ఓట్లు పోలయ్యాయి. కేసముద్రం మండలంలో 49,441 ఓట్లకు గాను 36,785 ఓట్లు పోలయ్యాయి. నెల్లికుదురు మండలంలో 37,911 ఓట్లకు గాను 28,273 ఓట్లు పోలయ్యాయి. గూడూరు మండలంలో 46,646 ఓట్లకు గాను 36,396 ఓట్లు పోలయ్యాయి. ఇనుగుర్తి మండలంలో 17,464 ఓట్లకు గాను 12,673 ఓట్లు పోలయ్యాయి. దంతాలపల్లి మండలంలోని (మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం) రెండు పోలింగ్ బూత్‌లు కలిగిన ఒకే గ్రామంలో 1882 ఓట్లకు గాను 1447 ఓట్లు పోలయ్యాయి.

ఇక డోర్నకల్ మండలంలో 39,137 ఓట్లకు గాను 30,657 ఓట్లు పోలయ్యాయి. కురవి మండలంలో 41,498 ఓట్లకు గాను 30,981 ఓట్లు పోలయ్యాయి. మరిపెడ మండలంలో 59,387 ఓట్లకు గాను 45,094 ఓట్లు పోలయ్యాయి. నర్సింహులపేట మండలంలో 24000 ఓట్లకు గాను 17,785 ఓట్లు పోలయ్యాయి. దంతాలపల్లి మండలంలో 24,987 ఓట్లకు గాను 17,691 ఓట్లు పోలయ్యాయి. చిన్నగూడూరు మండలంలో 13,073 ఓట్లకు గాను 9754 ఓట్లుపోలయ్యాయి. సీరోలు మండలంలో 20,824 ఓట్లకు గాను 16,089 ఓట్లు పోలయ్యాయి. మొత్తం జిల్లాలోని ఈ రెండు నియోజకవర్గాల పరిధిలో 12 మండలాల్లో మొత్తం 4,81,756 ఓట్లకు గాను 3,52,463 ఓట్లు అంటే 73.16 శాతం ఓట్లు పోలయ్యాయి. ఈ పోలింగ్ సరళిని గ్రామాల వారీగా తెలుసుకుంటూ ఆయా మండలాల్లో రాజకీయ భవిష్యత్ పెంచుకునే ఆశావహులు జయాపజయాల తీరును తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఉపాధి పనుల ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

- స్టేట్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ రాజారావు



గడ్డిగూడెంతండా శివారు ఎల్లమ్మకుంటలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాజారావు

మహబూబాబాద్ టౌన్, మే 16 : ఉపాధి పనుల ప్రదేశాల వద్ద మౌళిక సౌకర్యాలు కల్పించాలని స్టేట్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, ఉపాధి పనుల రాష్ట్ర ప్రత్యేక పరిశీలకుడు రాజారావు సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ఉపాధిహామి పనులపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల వద్ద గ్రామపంచాయతీ ద్వారా నీడ, తాగునీరు లాంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రోజూ కూలీకి రూ.300 పడే విధంగా పని చేయించాలని ఆదేశించారు.

జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడుతూ ప్రతీ ఎంపీడీవో గ్రామస్థాయిలో ఉపాధిహామీ పనులపై ప్రణాళికలు సిద్ధం చేసుకుని కూలీలకు గరిష్ఠ వేతనం పడేలా తగు చర్యలు తీసుకోవాలని చెప్పారు. జడ్పీ ఇన్‌చార్జ్ సీఈవో నర్మద మాట్లాడుతూ ఈజీఎస్ పనుల ప్రాంతాల్లో పని కొలతలు ముందస్తుగా మార్కింగ్ చేసి, పని చేయించాలని తెలిపారు. డీపీవో హరిప్రసాద్ మాట్లాడుతూ ఈజీఎస్ నందు నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్‌లను పూర్తిస్థాయిలో ఉపయోగంలోకి తీసుకురావాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ డీఆర్‌డీవో శాంతకుమారి, అంబుడ్స్ పర్సన్స్ ఆదెం, అబేద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

పనుల వద్ద వసతి కల్పనపై ఆగ్రహం

మహబూబాబాద్ రూరల్ : మండలంలోనిక్షళక్ష గడ్డిగూడెంతండా శివారులోని ఎల్లమ్మకుంట తండాలో ఉపాధి పనులను రాష్ట్రప్రభుత్వ కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ సెక్రటరీ రాజారావు పరిశీలించారు. పని చేస్తున్న ప్రదేశంలో కూలీలకు సరైన మౌళిక వసతులు కల్పించక పోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 1 నుంచి కేంద్ర, రాష్ట్రప్రభుత్వం రోజుకు కూలీలకు రూ.300 చెల్లిస్తుంటే ఇక్కడ మాత్రం సిబ్బంది రూ.120 నుంచి రూ.150 వరకు చెల్లించడం ఏమిటని ఎంపీడీవో రవికుమార్‌ను ప్రశ్నించారు. కూలీలకు తాగునీటి సౌకర్యంతో పాటు విశ్రాంతి కోసం టెంట్ ఎందుకు ఏర్పాటు చేయలేదని మండిపడ్డారు. చెరువులో మట్టినితీసి చెరువుకట్టకు పోయడం వల్ల ఏమి ఉపయోగమని, దానిని రైతు పొలాలకు తరలిస్తే ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు. పనులు చేస్తున్న ప్రాంతాల్లో బ్యానర్లు కట్టాలని చెప్పినప్పటికి అవి ఎందుకు ఏర్పాటు చేయలేదన్నారు. కూలీలకు కొలతల ప్రకారం.. పని ఎందుకు కల్పించడం లేదని, అలా చేస్తే ఎలా రూ.300 కూలీ వస్తుందని అధికారులను ప్రశ్నించారు. ఇంత నిర్లక్ష్యంగా పనులు చేయిస్తున్న ఏపీవో రమేష్‌రెడ్డి, టీఏ సంతోష్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్‌ను ఎందుకు సస్పెండ్ చేయకూడదో చెప్పాలని ఎంపీడీవో ప్రశ్నించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కుర్ర మహేష్ ఉపాధి కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై రాజారావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వీరన్న, శంకర్, అంజయ్య, శ్రీను, బాలు, కిషన్ పాల్గొన్నారు.

ఎన్నికల వేళ ఆర్టీసీ ఆదాయం రూ.28 లక్షలు



తొర్రూరు, మే 16 : ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో తొర్రూరు ఆర్టీసీ డిపోకు రూ.28 లక్షల అదనపు ఆదాయం సమకూరిందని మేనేజర్ పద్మావతి తెలిపారు. గురువారం తొర్రూరులో మాట్లాడుతూ డిపో పరిధిలోని వివిధ రూట్లలో ఈనెల 11వ తేదీ నుంచి 15 వరకు 152 ట్రిప్పులను నడపగా, రోజువారి ఆదాయం కాకుండా అదనంగా రూ.28 లక్షల ఆదాయం వచ్చిందని వివరించారు. డిపోలోని 76 సర్వీసులతో పాటు హైదరాబాద్ నుంచి మిగతా సర్వీసులను నడిపామన్నారు. రోజువారి ఆదాయం డిపోకు మహాలక్ష్మి పథకంతో కలిపి సుమారు రూ.22 లక్షలు వస్తుందని వివరించారు. డిపోలో 110 మంది డ్రైవర్లు, 170 మంది కండక్టర్‌లు, ఇతర సిబ్బంది సమర్థవంతంగా 5 రోజుల పాటు కష్టపడి విధులు నిర్వర్తిస్తే ఆదాయం లభించిందని తెలిపారు. డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రజిత సహకారంతో సిబ్బంది విధులు నిర్వర్తించారన్నారు. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు అధిక ఆదాయం, కేఎంపీఎల్ సాధించిన సిబ్బందికి శుక్రవారం డిపో ఆవరణలో సన్మానంతో పాటు మిఠాయిల పంపిణీ ఉంటుందని, విధుల్లో ఉన్న సిబ్బంది హాజరు కావాలన్నారు.

జిల్లాలో పలుచోట్ల వర్షం



చింతలగడ్డతండాలో లేచిపోయిన ఇంటిపైకప్పు

మహబూబాబాద్ అగ్రికల్చర్, మే 16 : జిల్లాలో గురువారం సా యంత్రం వర్షం కురిసింది. గాలిదుమారంతో ప్రారంభమై ఉరుములు, మెరుపులు మెరుస్తూ భారీవాన పడింది. మరిపెడ మండలంలో చింతలగడ్డతండాలో గాలివాన బీభత్సానికి రేకులతో కూడిన ఇంటిపైకప్పు గాలికి లేచిపోయింది. రెగ్యాతండాలో ఇంటి పైకప్పు రేకులు లేచిపోయి, సైదమ్మ అనే మహిళకు గాయాల య్యాయి. మరిపెడ పట్టణంలోనూ భారీ వర్షం కురుస్తోంది. బయ్యారం మండలంలో ఓ మోస్తారుతో పాటు ఉరుములు, మెరుపులు మెరుస్తున్నాయి. మహబూబాబాద్, గార్ల మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురుస్తోంది. కేసముద్రం, డోర్నకల్, దంతాలపల్లి, నెల్లికుదురు మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన చిరుజల్లులు కురుస్తున్నాయి. కాగా, భారీ వర్షం కురిసే అవకాశాలుఉన్నాయి.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- ఇప్పటి వరకు 24,658 మెట్రిక్ టన్నుల సేకరణ
- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మే 16 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం ధాన్యం కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 రబీ సీజన్‌లో జిల్లాలో మొత్తం కొనుగోలు కేం ద్రాలు 192 ఉండగా, అందులో 102 కొనుగోలు కేంద్రాల ద్వారా 4,909 మం ది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇప్పటి వరకు 24,658 మెట్రిక్ టన్నులు సేకరించామని, దాని విలువ రూ.54.27 కోట్లు ఉంటుందన్నారు. తూకం వేసిన ధాన్యాన్ని సంబంధిత మిల్లర్లకు రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వాతావరణ పరిస్థితులకనుగుణంగా వడ్లు వర్షాలకు తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లను ఉపయోగించాలని అన్నారు. ధాన్యం సేకరణకు తగినన్ని లారీలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఖరీఫ్ 2023-24కు సంబంధించిన ధాన్యం మిల్లుల ద్వారా మరాడించి త్వరిత గతిన బియ్యం పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, ఆర్డీవోలు అలివేలు, నర్సింహారావు, అధికారులు కృష్ణవేణి, రాజేందర్, అభిమాన్యు, విజయ, నళిని పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షల నిర్వహణకు పటిష్ఠంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై విద్యా, రెవెన్యూ, పోలీస్, వైద్య, పంచాయతీ, మునిసిపల్, విద్యుత్, పోస్టల్, ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 24 నుంచి జూన్ 1 వరకు ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నా యని తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, ద్వితీయ సంవత్సరం ఎగ్జామ్స్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. పరీక్ష కేంద్రాల పరిధిలో జిరాక్స్ షాపులను మూసివేసి 144 సెక్షన్ విధించా లన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని. పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలన్నారు. జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్ష నిర్వహణకు 4,679 మంది విద్యార్థులకు గాను 16 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. విద్యార్థులు, విధులు నిర్వహిం చే సిబ్బంది ఎవరు కూడా పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్లడానికి అనుమతులు లేవన్నారు. పరీక్షా సమయానికి ఆర్టీసీ బస్సులు నడిపించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అద నపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, ఎం.డేవిడ్, అధికారులు ఎస్.సత్యనారాయణ, రామారావు, శివప్రసాద్, అంబరీష, భద్రకాళి పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

అమ్మఆదర్శ పాఠశాలల పనులు స్కూళ్లు ప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎంపికైన అమ్మ ఆదర్శపాఠశాలలు 438 కాగా, అందులో 432 గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. అమ్మఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు ఏ మేరకు గ్రౌండింగ్ అయ్యాయో తెలుసుకునేందుకు మండలాల వారీగా టీంలను తయారు చేసి, రిపోర్ట్ సేకరించాలని చెప్పారు. చేపట్టిన పనులన్ని పాఠశాలల ప్రారంభానికి ముందుగానే పూర్తి చేయాలని, పను ల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, డీఈవో రామారావు, ప్లానింగ్ కోఆర్డినేటర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- నీరునిల్వ లేకుండా చూసుకోవాలి
- జిల్లా వైద్యాధికారి కళావతిబాయి

8


ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతున్న పాలకురి అశోక్‌కుమార్

శాసన మండలికి పంపిస్తే ప్రశ్నించే గొంతుకనవుతా..

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి అశోక్ కుమార్

వడ్డేపల్లి, మే 16: తెలంగాణ ఉద్యమకారుడిగా, జర్నలిస్టుగా, చరిత్రకారుడిగా, అధ్యాపకుడిగా సుదీర్ఘ అనుభవం ఉన్న తనను శాసన మండలికి పంపిస్తే ప్రశ్నించే గొంతుక నవుతానని వరంగల్ , ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పాలకురి అశోక్ కుమార్ అన్నారు. గురువారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిరుద్యోగులు, ఉద్యోగులకు అండగా నిలుస్తానని అన్నారు. గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తానని, మెగా డీఎస్సీ కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. బ్లాక్‌మెయిలర్లను ఎమ్మెల్సీగా ఎన్నుకోవద్దని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో గుగులోతు ప్రవీణ్, వినోద్ బోడ, తేజావత్ ప్రవీణ్, నవీన్ పట్నాయక్, వి. వంశీ, రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చేపపిల్లల పెంపకానికి నిర్మించిన హౌస్‌లు


చేపపిల్లల పెంపకానికి ఉపయోగించే ఫిష్ పాండ్

పేరుకే ఉచితం.. అంతా అనుచితమే..

- చేప పిల్లల పంపిణీలో దళారులు, అధికారుల చేతివాటం
- మత్స్యకారులకు చేరే లబ్ధి 30 నుంచి 40 శాతం మేరకే..
- సంఘాలకు నగదు బదిలీ చేయాలంటున్న మత్స్యకారులు



కాళోజీ జంక్షన్, మే 16 : రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ వృత్తిదారుల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టింది. అందులో భాగంగానే చేపలు పట్టే వృత్తిలో ఉన్న మత్స్యకారుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను సరఫరా చేసే కార్యక్రమాన్ని 2016 నుంచి చేపట్టి అమలు చేస్తోంది. గొర్రెలు, మేకల మాంసం ధరలు రోజు రోజుకూ ఆకాశాన్నంటుతూ సామాన్యులకు అందుబాటులో లేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో మత్స్య సంపద పెంపుదలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం బాగుందని అందరూ భావించారు. నిరుపేదలు సైతం కొనుగోలు చేసేందుకు చేపల పౌష్టికాహారం అందరికి అందుబాటులో ఉంటుందని తలపోశారు.

కాంట్రాక్టర్లకు అప్పగింత

మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు మేలురకం చేప పిల్లల పంపిణీని సరఫరా చేసే బాధ్యతను ప్రభుత్వం కాంట్రాక్టర్లకు అప్పగించింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టరు.. సాధారణంగా జూలైలో చెరువుల్లోకి నీరు చేరే సమయంలో కాకుండా అక్టోబరు నెల వచ్చే దాకా సరఫరా చేయకపోవడంతో మత్స్యకారులకు నష్టం వాటిల్లుతోంది. సుమారు 35 నుంచి 40 సెంటిమీటర్ల పొడవు గల చేప పిల్లలు సుమారు కిలో తూకం బరువు వచ్చే సరికి 8 నెలల సమయం పడుతోంది. కానీ కాంట్రాక్టరు ఆలస్యంగా చేప పిల్లలను సరఫరా చేయడంతో వేసవికాలం సమీపించి చెరువుల్లో నీరు తగ్గే వరకు సుమారు అర కిలో బరువు వరకు మాత్రమే ఎదగడంతో మత్స్యకారులకు నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం ఉచిత చేపపిల్లల పంపిణీ చేపట్టక ముందు మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ, కైకలూరు నుంచి తామే స్వయంగా వెళ్లి సొంత డబ్బులతో తెప్పించి వర్షాలు పడగానే జూలైలోనే చేప పిల్లలను చెరువుల్లో వదిలేవారు. అంతేగాక మేలు రకం చేపపిల్లల కొనుగోలు చేసి తీసుకొచ్చేవారు. సుమారు 7 నుంచి 8 నెలల కాలంలో చేపలు పూర్తిగా ఎదిగి మత్స్యకారులకు ప్రయోజనం చేకూరేది. హనుమకొండ జిల్లాలో 168 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా, వరంగల్ జిల్లాలో 184 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సంఘాలన్నింటికి చేపపిల్లలను ఉత్పత్తి చేసి పంపిణీ చేసేందుకు హనుమకొండలోని భీమారం శివారులో సుమారు 25 ఎకరాల స్థలంలో ఫిష్‌ఫామ్ సుమారు దశాబ్దా కాలం కిందటే అందుబాటులో ఉంది. కానీ ప్రస్తుతం అది నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుతోంది. ఈ ఫామ్‌లో చేప పిల్లల ఉత్పత్తిని ప్రారంభిస్తే హనుమకొండ, వరంగల్ జిల్లాలతోపాటు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా అన్ని మత్స్య సహకార సంఘాలకు మేలు రకం చేప పిల్లలను ఇక్కడి నుంచే సరఫరా చేసే అవకాశం ఉంటుంది. మత్స్య సంపద అభివృద్ధికి ఈ యేడు ఇంకా ప్రభుత్వం ఎలాంటి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించకపోవడం శోచనీయం.

సంఘాలకు నగదు బదిలీ చేయాలి

నీరటి సదానందం, ముదిరాజ్ మహా సభ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి



ప్రభుత్వం రైతులకు నేరుగా పెట్టుబడి సహాయం అందిస్తున్న విధంగా మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లల కొనుగోలుకు నేరుగా నగదు బదిలీ చేయాలి. దీంతో సంఘాలు సకాలంలో మేలు రకం చేప పిల్లల విత్తనాలను కొనుగోలు చేసేందుకు వీలవుతుంది. మత్స్యకారులు బాగుపడుతారు.

కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలి..

బుస్స మల్లేశం, హనుమకొండ మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు



చేప పిల్లల పంపిణీలో కాంట్రాక్టర్ వ్యవస్థను రద్దు చేయాలి. నెలల తరబడి ఆలస్యంగా కాంట్రాక్టర్ చేప పిల్లలను సరఫరా చేయడం వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారు. అంతేగాక నాసిరకం చేపపిల్లలను సరఫరా చేయడం వల్ల దిగుబడి తగ్గి సరైన ఆదాయం లభించడం లేదు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల్లో వేగం పెంచండి

- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- వివిధ విభాగాల అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, మే 16: గ్రేటర్ వరంగల్ పరిధిలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులలో వేగం పెంచాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న ఎలక్ట్రిఫిషన్ మరుగుదొడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని ఏఈలకు సూచించారు. ఇంకా కొన్ని పాఠశాలలో పనులు ప్రారంభించలేదని తెలిసిందని, వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్నివిధాలుగా సహకారం అందిస్తోందని, పనులకు ముందస్తుగా 25 శాతం నిధులను కేటాయించిందన్నారు. ఇప్పటి వరకు మైనర్ పనులు పూర్తిచేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇంకా చైర్‌పర్సన్లు, పాఠశాలల ప్రధానోపాధ్యాయుల మధ్య సమన్వయం ఉన్నప్పుడే పనులు త్వరగా జరుగుతాయని అన్నారు. పనుల కోసం బల్దియా ఇంజనీరింగ్ అధికారులు సాంకేతిక సహకారం అందిస్తారని అన్నారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీపీఆర్వో రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేష్, ఈఈలు రాజయ్య, సంజయ్‌కుమార్, డీఈలు రవికుమార్, సంతోష్‌బాబు, శివానంద్, శ్రీకాంత్, సీఈవోలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నిరుద్యోగులను మోసం చేసిన కాంగ్రెస్

పట్టభద్రుల ఎమ్మెల్సీ బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి


సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి

జనగామ, మే 16 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ పేరుతో ఓట్లు వేయించుకొని కాంగ్రెస్ నిరుద్యోగులను మోసం చేసిందని వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి విమర్శించారు. జనగామ మండలం పసరమడ్ల శివారులోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన జనగామ నియోజకవర్గస్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.4వేలు నిరుద్యోగ భృతి, 50 ఖాళీలతో మెగా డీఎస్సీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా జాబ్ క్యాలెండర్ ప్రకటన ఊసే లేదన్నారు. గతంలో పట్టభద్రులు మేధావులను మాత్రమే ఎన్నుకున్నారని, అదే పరంపరను కొనసాగిస్తూ తనను గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న బ్లాక్ మెయిలర్ అని, ప్రశ్నిస్తానని చెప్పే మల్లన్న కాంగ్రెస్ పార్టీని ఒక్కసారైనా ప్రశ్నించారా అని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించేవాడు కావాలో, ప్రభుత్వాన్ని ప్రశంసించే వారు కావాలో ఆలోచించుకోవాలన్నారు. తన ఎదుగుదలను చూసి ఓర్వలేక బీజేపీలో తనను రాజకీయంగా హత్య చేస్తే కేసీఆర్ ఆదరించి అభ్యర్థిగా అవకాశం కల్పించారని అన్నారు.

తీన్మార్ మల్లన్న ఓ బ్లాక్‌మెయిలర్: పల్లా

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న ఓ పెద్ద బ్లాక్‌మెయిలర్ అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. పోలీసులను వాడుకొని తన సంస్థల మీద ఫిర్యాదులు చేయిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడని, రూ.2కోట్లు డిమాండ్ చేస్తే ఒక్క రూపాయి కూడా ఇవ్వనని తేల్చి చెప్పానని అన్నారు. తన భార్యకు తెలంగాణ ఏర్పాటుకు ముందే ఉద్యోగం వస్తే కేసీఆర్ వచ్చాక ఉద్యోగం వచ్చిందంటూ దుష్ప్రచారాలు చేశాడని, దేశంలో అన్ని రాష్ట్రాల కంటే తెలంగాణలోనే ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రాష్ట్రం రూ.7లక్షల కోట్ల అప్పు చేశారని శ్వేతపత్రాల పేరుతో కాంగ్రెస్ అబద్ధాలు ప్రచారం చేసిందని, ఆర్‌బీఐ ఇచ్చిన నివేదికలో రూ.3.80 లక్షల కోట్లు అని చూపించిందని గుర్తు చేశారు. ఈ సమావేశంలో జనగామ జడ్పీ చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మీ, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, నాయకులు ఎడవెల్లి కృష్ణారెడ్డి, నర్సింగరావు, బాల్దె సిద్ధిలింగం, బక్క నాగరాజుయాదవ్, ఇర్రి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు వడ్లకూ బోనస్ ఇవ్వాలని నిరసన

రైతులు పండించే దొడ్డు రకం వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మండిపడిన ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో భాగంగా బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎన్నికల వేళ బోనస్ ఇస్తామంటూ ప్రకటించి కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, కేవలం సన్న వడ్లకే ఇస్తామంటూ రైతులను కాంగ్రెస్ మరోసారి దగా చేసిందన్నారు


సమావేశానికి హాజరైన కార్యకర్తలు, పట్టభద్రులు

కేయూ ప్రక్షాళన జరిగేనా?

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

- వివాదాలకు కేరాఫ్‌గా కాకతీయ యూనివర్సిటీ
- వీసీ రమేష్ నియామకం నుంచే వివాదాలు మొదలు
- ప్రక్షాళనపై సీఎం ప్రకటనతో విద్యార్థులు, ప్రొఫెసర్లలో ఆశలు



ఎంతో ఘన చరిత్ర కలిగిన కాకతీయ యూనివర్సిటీలో అక్రమాలు రాజ్యమేలుతున్నాయి. కోట్ల విలువైన భూములు అన్యాక్రాంతంతో పాటు అధ్యాపకులు నియామకాల్లో అక్రమాలు, పీహెచ్‌డీ అడ్మిషన్లలో అవకతవకలు, అధిక మెస్ బిల్లులతో పాటు ఆర్ట్స్ కాలేజీ ఫీజుల నిధుల మాయ, ఫాండీ అనుమతుల్లో అక్రమాలు లాంటివి వర్సిటీ ప్రతిష్టను దిగజార్చాయి. కొన్నేళ్లుగా యూనివర్సిటీ పరిపాలన గాడితప్పిందని, దీనిని ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో వర్సిటీకి మంచిరోజులు రాబోతున్నాయని విద్యార్థులు, అధ్యాపకులు భావిస్తున్నారు.

వీసీగా రమేష్ నియామకం నుంచే వివాదాలు

వైస్ చాన్సలర్‌గా తాటికొండ రమేష్ నియామకం జరిగిన నాటి నుంచే వివాదాలు మొదలయ్యాయి. కేయూ వీసీ నియామకానికి 2019 జూలై 8వ తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. వీసీగా పని చేయడానికి పదేళ్లకు పైగా ప్రొఫెసర్‌గా పని చేసిన అనుభవం ఉండాలనే నిబంధన ఉంది. అయితే తాటికొండ రమేష్ 2009 జూలై 14న ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారని, నోటిఫికేషన్ నాటికి రమేష్‌కు పదేళ్లు పూర్తవడంతో ఆయన వీసీకి అనర్హుడంటు అప్పట్లో ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై కొందరు అధ్యాపకులు లోకాయుక్తను కూడా ఆశ్రయించారు. అయితే ఇవేవీ పట్టించుకోకుండా సెర్చ్ కమిటీ ఇచ్చిన నివేదిక ఆధారంగా గత ప్రభుత్వం కేయూ వీసీగా రమేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో 2021 జూన్ 24న రమేష్ వీసీగా బాధ్యతలు స్వీకరించారు. కాగా, ఈ వివాదంపై నిజామాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ విద్యాసాగర్‌రెడ్డి లోకాయుక్తలో ఫిర్యాదు చేయగా.. ఈ కేసును వాదించడానికిగాను కేయూ నిధుల నుంచి రూ.5లక్షలు వీసీ లాయర్‌కు చెల్లించారని అధ్యాపకులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. వీసీగా రమేష్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి కేయూ వివాదాలకు కేరాఫ్‌గా మారిందనే చర్చ జరుగుతోంది. అయితే ఈ నెలలో వీసీ రమేష్ పదవీకాలం ముగుస్తుండటంతో కొత్త పాలక మండలి నియామకంతో పాటు కేయూలో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశిస్తుందనే ప్రచారం జరుగుతోంది.

కబ్జాలు, అక్రమాలపై నివేదికలేవీ?

కేయూలో పలు అక్రమాలు, అవినీతిపై వేసిన విచారణ కమిటీల నివేదికలు చెత్తబుట్టలోకి వెళుతున్నాయని విద్యార్థులు, అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ యూనివర్సిటీకి కేటాయించిన భూముల్లో వందల ఎకరాలు ఇప్పటికే అధికారుల నిర్లక్ష్యంతో కబ్జాకోరుల చేతుల్లోకి వెళ్లాయి. అయితే 229 సర్వే నెంబరులో కేయూ ఉద్యోగులతో పాటు కొందరు పోలీసులు, రాజకీయ నేతలు సుమారు 12ఎకరాల భూములను అక్రమంగా కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. దీనిపై విద్యార్థులు, అధ్యాకులు ఆందోళన చేయటంతో 13మందికి నోటీసులు ఇచ్చారు. ముగ్గురు ప్రొఫెసర్లతో ల్యాండ్ కమిటీని ఏర్పాటు చేశారు. తొలుత అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌బాబు కన్వీనర్‌గా కమిటీని వేయగా, కబ్జా చేసినట్లు ఆరోపణలు వచ్చిన వారిలో అశోక్‌బాబు పేరు కూడా ఉండటంతో విద్యార్థులు, అధ్యాపకుల ఆందోళనతో అశోక్‌బాబు పేరు తొలగించి ప్రొఫెసర్ చంద్రమౌళి కన్వీనర్‌గా, ప్రొఫెసర్లు మనోహర్, నాగేంద్ర బాబు సభ్యులుగా ల్యాండ్ కమిటీ 2022 అక్టోబరులో కొలువు తీరింది. ఈ కమిటీ సుమారు ఏడాది పాటు భూ కబ్జాలు, అక్రమాలపై పరిశీలన చేసి 2023 డిసెంబరులో వీసీ రమేష్‌తో పాటు పాలకమండలికి నివేదికను అందించింది. అయితే ఇప్పటి వరకు ఈ నివేదికలో ఏముందో వీసీ బహిర్గతం చేయకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూ కబ్జాలకు వీసీ అండగా నిలుస్తున్నారనే ఆరోపణలను ఎదుర్కొంటున్నారు. అలాగే పీహెచ్‌డీ అడ్మిషన్లలో అక్రమాలు జరిగాయని 2023 సెప్టెంబరు నెలలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై దృష్టి పెట్టింది. రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి, సాంకేతిక విద్యా సంయుక్త కార్యదర్శి వెంకటేశ్వర్లుతో త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నివేదిక ఆధారంగా పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. అయితే ఈ కమిటీ ఇచ్చిన నివేదిక కూడా బహిర్గతం కాకపోవడంపై విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. అలాగే ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఫీజుల పేరుతో సుమారు రూ.5కోట్లు స్వాహా చేసినట్టు ఆరోపణలున్నాయి. 2014-15 విద్యా సంవత్సరం నుంచి ఆర్ట్స్ కాలేజీలో ట్యూషన్ ఫీజు, టీసీల ఫీజు, కాలేజీ ఫీజుతో పాటు ఇతర ఫీజులకు సంబంధించి యూనివర్సిటీకి సంబంధం లేకుండా కాలేజీ పని చేసే ఓ ఉద్యోగి వసూళ్లు చేసి, బ్యాంకు ఖాతాలో జమ చేయలేదని ఫిర్యాదులు అందాయి. దీనిపై ప్రొఫెసర్ మనోహర్ ఒత్తిడి మేరకు వీసీ రమేష్ 2021, ఆగస్టు 24న అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రీలతాదేవి, ఆడిట్ విభాగంలో పని చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీలతలతో కూడిన ద్విసభ్య కమిటీని నియమించారు. 15రోజుల్లోపు కమిటీ నివేదిక అందించాలని వీసీ ఆ లేఖలో ఆదేశించి మూడేళ్లు కావస్తున్న నివేదికలు నిద్రపోతున్నాయి. ఈ కుంభకోణంలో సుమారు రూ.5కోట్లు మాయం అయినట్లుగా సమాచారం. కేయూలో జరుగుతున్న అక్రమాలపై ఎన్ని నివేదికలు వేసిన అవి నామమాత్రంగా మిగిలిపోతున్నాయి. పై అధికారుల ఒత్తిడి, రాజకీయ నేతల బెదిరింపులతో నివేదికలు చెత్తబుట్టల పాలవుతున్నాయి.

నిధులు మాయం, అక్రమాలపై మౌనమే..

కేయూలో అనుబంధ అధ్యాపకులను నిబంధనలకు విరుద్ధంగా నియమించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలక్షన్ కమిటీ లేకుండా కేయూలో గతేడాది జనవరి 30న 12మందిని, మార్చిలో నలుగురిని కలిపి మొత్తం 16మందిని పాలక మండలి అనుబంధ అధ్యాపకులుగా నియమించటంపై విమర్శలున్నాయి. వీరికి ఒక్కొక్కరికి నెలకు రూ.50వేల చొప్పున 16మందికి ప్రతినెల రూ.8లక్షల వేతనాలు చెల్లిస్తున్నారని, అయితే ఇప్పటి వరకు వీరు ఎలాంటి పరిశోధనలు చేయటం లేదని, క్లాసులు తీసుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. వీరికి ఇప్పటి వరకు రూ.90లక్షల వరకు వేతనాలు చెల్లించారని దీనిపై ప్రభుత్వం విచారణ జరిపించాలని కేయూ అధ్యాపకులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే కేయూలో సీడ్‌మనీ పేరుతో నకిలీ పరిశోధన ప్రాజెక్టులతో రూ.20లక్షలకు పైగా నిధులు స్వాహ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆరుగురు ప్రొఫెసర్లతో కలిసి సీడ్‌మనీ పేరుతో జరిగిన ఈ అక్రమాలపై విచారణ జరిపించాలని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్ (అకుట్) బృందం డిమాండ్ చేసిన స్పందన లేదు. అలాగే ఆర్ట్స్ కాలేజీలో ఫీజుల పేరుతో రూ.5కోట్లకు పైగా స్వాహ అయినట్లుగా ఆరోపణలు రావటంతో ఓ కమిటీ వేసి చేతులు దులుపుకొన్నారు. అలాగే మెస్ బిల్లుల పేరుతో రూ.2.50కోట్ల స్కాం జరిగినట్లుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై ఫిర్యాదులు వచ్చిన వీసీ, పాలక మండలి మౌనమే అనే విమర్శలున్నాయి. అలాగే కేయూ పరిధిలో మొత్తం 24ఫార్మసీ కాలేజీలు ఉండగా.. 12 కాలేజీలు డీ ఫార్మసీ కోర్సును ప్రవేశపెట్టేందుకు అనుమతులు కోరుతూ యూనివర్సిటీకి దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఫామ్ డీ కోసం దరఖాస్తు చేసుకున్న 12కాలేజీల్లో ఆరు ఫార్మసీకాలేజీలకు మాత్రమే 300 పడకల ఆస్పత్రులు అనుబంధంగా కలిగి ఉన్నాయి. మిగతా ఆరు కాలేజీలకు ఎలాంటి అనుబంధ వైద్యశాలలు లేకపోయినా యూనివర్సిటీ అనుమతులు ఇవ్వటం వివాదస్పదంగా మారింది. దీని వెనుక భారీగా చేతులు మారినట్లు ప్రచారం జరుగుతుంది. అలాగే అసోసియేట్ ప్రొఫెసర్ల, సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయనే చర్చ కూడా జరుగుతోంది.

ప్రస్తుత వీసీ రమేష్ పదవి కాలం ఈ నెల 21న ముగుస్తోంది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని యూనివర్సిటీలకు ప్రభుత్వం సెర్చ్ కమిటీలు నియమించగా కాకతీయ యూనివర్సిటీకి మాత్రం సెర్చ్ కమిటీని నియమించక పోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. కేయూలో జరుగుతున్న అక్రమాలు, అవినీతిపై విజిలెన్స్ విచారణ చేపట్టే యోచనలో ఉన్న ప్రభుత్వం ప్రస్తుత వీసీనే ఇంఛార్జిగా కొనసాగిస్తారా లేక కొత్త వీసీ వచ్చే వరకు ఎవరైనా సీనియర్ ప్రొఫెసర్‌కు బాధ్యతలు అప్పగిస్తారా అనేది చర్చనీయాంశంగా మారింది. మొత్తానికి పాలనను గాడిలో పెట్టేందుకు కేయూ ప్రక్షాళన చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

కేయూ వీసీ ఎంపిక ఇప్పట్లో లేనట్టేనా?

వరంగల్ ఎడ్యుకేషన్, మే 16 : కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఎంపిక లేనట్టేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాన్నింటికి వీసీలను నియమించేందుకు సెర్చ్ కమిటీలను ప్రభుత్వం.. కాకతీయ విశ్వవిద్యాలయానికిమాత్రం నియమించలేదు. దీంతో ఈ అనుమనాలకు బలం చేకూరుతోంది. వీసీ పదవీ కాలం ఈ నెలాఖరును ముగుస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం సెర్చ్ కమిటీ ఏర్పాటు చేయకపోవడం చర్చనీయాంశంగా మారింది. దీంతో వర్సిటీలోని కొందరు తిరిగి పాత వీసీనే కొనసాగించే అవకాశం ఉందని అభిప్రాయపడుతుండగా.. యూనివర్సిటీకి పూర్తిస్థాయి పాలకమండలి లేకపోవడంతోనే ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించలేదన్న మరో వాదన వినిపిస్తోంది. ఇదిలా ఉంటే యూనివర్సిటీలో గందరగోళ పరిస్థితులు ఉన్నాయని, వాటిని చక్కదిద్దాకే వీసీ నియామకం చేపట్టే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత వీసీపై అవినీతి అక్రమాల ఆరోపణలు వస్తుండటం, అకూట్ సభ్యులు నేరుగా వీసీపై అవినీతి అరోపణలు చేస్తుండటంతో ప్రభుత్వం అసలు విషయాన్ని తెలుసుకునేందుకు ఇంటలిజెన్స్ వర్గాలను ఆరా తీస్తున్నట్టు వర్సిటీలో ప్రచారం జరుగుతోంది.

సీఎం రేవంత్‌రెడ్డిపైనే ఆశలు



కాకతీయ యూనివర్సిటీలో జరుగుతున్న అక్రమాలు, కబ్జాలపై సీఎం రేవంత్‌రెడ్డికి పూర్తిస్థాయిలో అవగాహన ఉంది. 2023 సెప్టెంబరు 14న వరంగల్ నగరానికి టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చిన రేవంత్‌రెడ్డి విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా నిలిచారు. వీసీ రమేష్‌ను పల్లా రాజేశ్వర్‌రెడ్డికి బంట్రోతుగా పోల్చుతూ.. విద్యార్థులు జీవితాలను వీసీ నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వీసీ నియామకాన్ని రద్దు చేయటంతో పాటు ఆయన తీసుకున్న నిర్ణయాలను కూడా రద్దు చేస్తామని, వీసీ అక్రమలు, అవినీతిపై విచారణ జరిపిస్తామని అనాడు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఆ మాటకు కట్టుబడి ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే పీహెచ్‌డీ అడ్మిషన్లలో జరిగిన అక్రమాలపై త్రిసభ్య కమిటీని వేసి నివేదిక తెప్పించుకున్నారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గతనెల 24న మడికొండలో జరిగిన జనజాతర బహిరంగ సభలో రేవంత్‌రెడ్డి కాకతీయ యూనివర్సిటీని ప్రక్షాళన చేస్తానని, వీసీ రమేష్‌ను తొలిగించి, విచారణ చేయిస్తానని ప్రకటన చేశారు. దీంతో కొన్నాళ్లుగా వివాదాలకు కేరాఫ్‌గా మారిన కేయూపై సీఎం దృష్టిసారించారనే చర్చ యూనివర్సిటీలో జరుగుతోంది. ప్రస్తుతం వీసీ పదవీ కాలం ఈ నెల 21తో ముగుస్తుండటంతో కొత్త పాలక మండలి, వీసీ నియామకంతో పాటు విజిలెన్స్ విచారణకు ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉన్నట్లుగా ప్రచారం జరుగుతోంది. రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం వీసీ రమేష్ హయంలో తీసుకున్న నిర్ణయాలతో పాటు అక్రమాలు, అవినీతిపైన విచారణ చేయించే అవకాశం ఉందని, జూన్ 6వ తేదీ వరకు రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా కోడ్ ముగిసిన తరువాత కేయూ ప్రక్షాళన దిశగా ప్రభుత్వం అడుగులు పడతాయన్న ఆశతో విద్యార్థులు, అధ్యాపకులు ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కాజీపేట, మే 16: కాజీపేట ప్రభుత్వ ఐటీఐలో 2024- 2025 విద్యా సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఇండస్ట్రీయల్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ కాజీపేట ప్రిన్సిపాల్ కె. అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ట్రేడ్‌లు, సీట్ల వివరాలు ఇలా ఉన్నాయి. ఎలక్ట్రీషన్‌లో - 20 సీట్లు, ఎలక్ట్రానిక్ మెకానిక్ - 24, టర్నర్ - 20, డ్రాఫ్ట్‌మాన్ సివిల్ - 24, డ్రెస్ మేకింగ్ - 40, స్టెనో (ఇంగ్లీష్) - 24 సీట్లు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి మార్కుల జాబితా, రూల్‌ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జూలై 10వ తేదీలోగా iti.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బొగ్గు లారీ

దంపతులకు గాయాలు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 16: ద్విచక్ర వాహనాన్ని బొగ్గు లారీ ఢీకొట్టగా వృద్ధ దంపతులు గాయపడిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని కారల్‌మార్క్స్‌కాలనీకి చెందిన శిరుప సమ్మయ్య, విజయలక్ష్మి దంపతులు ద్విచక్ర వాహనంపై సుభాష్‌కాలనీలోని సంతకు బయల్దేరారు. ఈక్రమంలో అంబేద్కర్ కూడలిలో రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనాన్ని కాటారం వైపు నుంచి వచ్చిన బొగ్గు లారీ ఢీకొంది. దీంతో ఇద్దరు లారీ కింద పడిపోయారు. విజయలక్ష్మికి తీవ్ర గాయం కాగా ఆమె భర్త స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు 108కు సమాచారం అందించినా అందుబాటులోకి రాలేదు. ఆ దీంతో భూపాలపల్లి మహిళా ఎస్సై సంధ్యారాణి పోలీసు వాహనంలో ఇద్దరిని మంజూర్‌నగర్‌లోని వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతానికి రెండు గేదెల మృత్యువాత

కృష్ణకాలనీ (భూపాలపల్లి), మే 16: విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందిన ఘటన భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. రైతులు శాదం వెంకన్న, చింతకాయల కిరణ్‌కు చెందినగౌడి గేదెలు ఎప్పటిలాగే మేతకు వెళ్లాయి. ఈ క్రమంలో గ్రామశివారులో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలి అక్కడికక్కడే మృతి చెందాయి. ఒక్కో గేదె విలువ రూ. 1,15,000 ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకున్నారు.

చల్లగరిగ శివారులో..

చిట్యాల : మండలంలోని చల్లగరిగ గ్రామ శివారులో మేతకు వెళ్లిన పాడి గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. బాధిత రైతు సిరిపెల్లి నరేష్ తెలిపిన వివరాల మేరకు.. రోజులాగే గురువారం మేతకు వెళ్లిన గేదెకు 11కేవీ విద్యుత్ తీగ తాకడంతో అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.50 వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకున్నాడు.



మారోజు వీరన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మారోజు వీరన్న సిద్ధాంతంతోనే సమసమాజ స్థాపన

ద్రావిడ సేవా సమితి అధ్యక్షుడు శ్రీకాంతాచారి

కాళోజీ జంక్షన్, మే 16: మారోజు వీరన్న సిద్ధాంతం ఆచరణ ద్వారానే దేశంలో సమ సమాజ స్థాపన సాధ్యమవుతుందని ద్రావిడ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పూసాల శ్రీకాంతాచారి అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో న్యాయవాది బండి మొగిలి అధ్యక్షతన నిర్వహించిన మారోజు వీరన్న వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మారోజు వీరన్న సిద్ధాంతానికి భయపడిన ఆనాటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వీరన్నను 1999లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపించాడని అన్నారు. మతోన్మాద, ఫాసిస్టు పాలన చెలరేగిన సమకాలీన సమాజంలో మారోజు వీరన్న సిద్ధాంతం చాలా అవసరమని ఆయన అన్నారు. విశిష్ఠ అతిథిగా పాల్గొన్న వరంగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ మాట్లాడుతూ.. మారోజు వీరన్న లేవనెత్తిన కుల వర్గ జమిలీ పోరాట సిద్ధాంతం విప్లవ పార్టీల్లోనే కాకుండా దేశ వ్యాప్తంగా చర్చకు వచ్చిందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కొంగ వీరస్వామి, ఎంసీపీఐ నాయకులు గోనె కుమారస్వామి, మాస్ సావిత్రి, తెలంగాణ రైతు సంఘం నాయకులు మోర్తాల చందర్‌రావు, అభ్యుదయ రచయితల సంఘానికి చెందిన నిధి, న్యాయవాదులు కూనూరు రంజిత్‌గౌడ్, వేముల రమేష్, మహేందర్, వివిధ సంఘాల నాయకులు ఏదునూరి రాజమౌళి, కేడల ప్రసాద్, వేణుచారి, రామారావు, దిడ్డి ధనలక్ష్మి, చాగంటి మంజుల, వల్లాల జగన్‌గౌడ్, సాయిబాబా తదితరులు పాల్గొని వీరన్న చిత్రపటానికి నివాళులర్పించారు.

పరారీలో ఉన్న ఖైదీని పట్టుకున్న పోలీసులు



పెద్దముప్పారంలో నిందితుడు వీరన్నను పట్టుకున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్, మే 16 : ఓ హత్య కేసులో పెరోల్‌పై వచ్చి.. తప్పించుకు తిరుగుతున్న మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన సందుల వీరన్నను దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామం గురువారం పోలీసులు పట్టుకున్నట్టు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. కంబాలపల్లికి చెందిన సందుల వీరన్న 1982లో ఓ హత్య కేసులో వరంగల్‌లోని సెంట్రల్ జైలులో జీవితఖైదీగా శిక్ష అనుభవిస్తున్నాడు. 1984లో పెరోల్‌పై బయటికి వచ్చాడు. నాటి నుంచి నేటి వరకు సుమారు 40 సంవత్సరాలు పోలీసులకు, జైలు అధికారుల కళ్ళుకప్పి తిరుగున్నట్టు పేర్కొన్నారు. పెద్దముప్పారం గ్రామంలో ఓ ఇంట్లో ఉన్నట్టుపక్కా సమాచారంతో గుర్తించి, వీరన్నను పట్టుకున్నట్టు సీఐ సర్వయ్య తెలిపారు. అనంతరం ఆ నిందితున్ని వరంగల్ జైలు అధికారులకు ముప్పారంలోనే అప్పగించినట్టు పేర్కొన్నారు. ఈ దాడిలో ఎస్సైలు దీపికారెడ్డి, కరుణాసాగర్, జైలు అధికారులు శ్రీనివాస రావు, రామకృష్ణరెడ్డి, నాగరాజు, రఘు, యాసిన్ పాల్గొన్నారు.

ఆహా.. ఏమి రుచి..



- మహిళా డెయిరీ పాల పదార్థాలకు భలే గిరాకీ
- సమ్మర్‌లో కూల్‌కూల్‌గా ఉంటుందని వినియోగం
- డెయిరీ టెక్నాలజీతో రుచికరమైన పదార్థాలు తయారీ



భీమదేవరపల్లి, మే 16: వేసవి తాపాన్ని తగ్గించేందుకు వినియోగదారులు ఎక్కువగా పాల పదార్థాలను స్వీకరిస్తారు. ముల్కనూర్ మహిళా డెయిరీలో డెయిరీ టెక్నాలజీతో రుచికరమైన పదార్థాలను తయారు చేస్తున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగదారుడి అభిరుచులకు అనుగుణంగా కొత్త కొత్త పాలపదార్థాలను డెయిరీ మార్కెట్లోకి విడుదల చేసింది. నాణ్యమైన పదార్థాలను సరసమైన ధరల్లో అందిస్తున్నారు. దీంతో ముల్కనూర్ మహిళా డెయిరీ పాల పదార్థాలకు భలే గిరాకీ ఏర్పడింది. మహిళా డెయిరీ సిబ్బంది మారుతున్న కాలానికి అనుగుణంగా వివిధ రకాలైన పాల పదార్థాలను రుచికరంగా అందిస్తోంది. 2002లో ప్రారంభమైన ముల్కనూర్ మహిళా డెయిరీ.. పాలతో పాటు పాల పదార్థాలను తయారు చేసి అమ్మాలని నిర్ణయించింది. కొన్నేళ్ల నుంచి కొత్త కొత్త పాల పదార్థాలను తయారు చేసి మార్కెట్లోకి విడుదల చేసింది. ప్రస్తుతం మహిళా డెయిరీ యేటా రూ.వంద కోట్ల టర్నోవర్‌కు చేరింది.

డెయిరీ అందిస్తున్న పదార్థాలు

మహిళా డెయిరీలో పాలు, పెరుగు, మజ్జిగ, పన్నీర్, నెయ్యి, స్వీట్ లస్సీ దూద్ పేడ, మిల్క్ కేక్, బాసుందీ, బాదం మిల్క్, మ్యాంగో లస్సీ తదితర పాల పదార్థాలను వినియోగదారుడికి అందుబాటులో ఉంచింది. వినియోగదారులు అవసరమైన పరిమాణంలో అందిస్తోంది. హనుమకొండ, వరంగల్, ఆదిలాబాద్, సిద్దిపేట, భూపాలపల్లి, కరీంనగర్, జనగామ, హైదరాబాద్ తదితర జిల్లాలలో 18 ఔట్‌లేట్లను ఏర్పాటు చేసి వినియోగదారునికి నాణ్యమైన, సరసమైన ధరలలో అందిస్తుంది.

నెల రోజుల వినియోగం ఇలా...

ముల్కనూర్ మహిళా డెయిరీ నెల రోజుల్లో 15.66 లక్షల లీటర్ల పాలు, 64,710 పది కిలోల పెరుగు బకెట్లు, 7,795 ఐదు కిలోల పెరుగు బకెట్లు, 89,904 రెండు వందల గ్రాముల పెరుగు ప్యాకెట్లు, 280 కిలోల పన్నీర్, 303 కిలోల దూద్ పేడ, 55 కిలోల మిల్క్‌కేక్, 4,130 లీటర్ల లస్సీ, 40 కిలోల కోవా, 2,075 కిలోల నెయ్యిని గత నెల రోజులుగా అమ్మినట్లు డెయిరీ సిబ్బంది తెలిపారు.

ఫ్రీజర్ వాహనాల వినియోగం

మహిళా డెయిరీ పరిధిలో వినియోగదారుడికి నాణ్యమైన, రుచికరమైన పాల పదార్థాలను అందించేందుకు ఫ్రీజర్ వాహనాన్ని వినియోగిస్తున్నారు. రూ.20లక్షల వ్యయంతో రెండు ఫ్రిజర్ వాహనాలను డెయిరీ కొనుగోలు చేసింది. వినియోగదారులు ఎక్కువ మొత్తంలో పెరుగు బక్కెట్లు, మజ్జిగ ప్యాకెట్లు ఆర్డర్‌పై అమ్మే రేటుకు ఫ్రీజర్ వాహనాల ద్వారా సమకూరుస్తారు. ఫ్రీజర్ వాహనాలకు ఎలాంటి రుసుం లేదు. పాల పదార్థాలను ఆధునిక యంత్రాల ద్వారా తయారు చేసి ప్రయోగశాలలో పరీక్షించిన తరువాతనే మార్కెట్లోకి విడుదలకు అనుమతిస్తారు. ఎంటెక్ డెయిరీ టెక్నాలజీ చదివిన విద్యార్థుల పరిజ్ఞానంతో పాటు ఆధునిక టెక్నాలజీని వినియోగించి, వినియోగదారుడికి రుచికరమైన పదార్థాలను తయారు చేస్తుంది. నిరంతరం మార్కెట్లో పాల పదార్థాల్లో కొత్త వెరైటీలను వినియోగదారుడు కోరుకుంటున్నాడు. అందుకు అనుగుణంగా ఉత్పత్తులను తయారు చేస్తున్నారు.

వినియోగదారుడి అభిరుచి మేరకు..

మార్పాటి భాస్కర్‌రెడ్డి, మహిళా డెయిరీ జనరల్ మేనేజర్



వినియోగదారుడి అభిరుచి మేరకు పాల పదార్థాలను తయారు చేస్తున్నాం. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా వాటి పరిమాణం తయారు చేస్తున్నాం. వివాహాది శుభకార్యాలలో మజ్జిగతో మొదలై, మీగడ పెరుగుతో భోజనం తీపి పదార్థంతో ముగింపు చేసేలా పాల పదార్థాలను తయారు చేస్తున్నాం. లాభాపేక్ష కన్నా వినియోగదారుడికి సరసమైన ధరలో నాణ్యమైన ఉత్పత్తులను అందించడమే మా లక్ష్యం. వినియోగదారులకు పాలు, పాల పదార్థాలను చేరడానికి ఆధునికమైన ఫ్రీజర్ వాహనాలను వినియోగిస్తున్నాం. మేము కష్టపడి సంపాదించే ప్రతీ పైసా మహిళలకు చెందుతుంది. నాణ్యత, రుచికి మారుపేరైన మహిళా డెయిరీ ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి.



పార్ట్‌టైమ్ అధ్యాపకులను కాంట్రాక్టు అధ్యాపకులకు కన్వర్షన్ చేయాలి



కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్‌టైమ్ అధ్యాపకులు

వరంగల్ ఎడ్యుకేషన్, మే 16: కాకతీయ విశ్వవిద్యాలయంలో పార్ట్‌టైమ్ అధ్యాపకులుగా పనిచేస్తున్న వారిని కాంట్రాక్ట్ అధ్యాపకులుగా కన్‌వర్షన్ చేయాలని పార్ట్‌టైమ్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ వై.రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం కేయూ పరిపాలన భవనముందు వారు ధర్నా చేశారు. అనంతరం రాత్రి వరకు రిజిస్ట్రార్ చాంబర్‌లో కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుధవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఇచ్చిన మాట తప్పారని ఆరోపించారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి లేఖ రాస్తానని చెప్పి మాట తప్పారన్నారు. కన్‌వర్షన్ కోసం అఫిడవిట్ తీసుకురమ్మని చెప్పిన వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ కలవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రెటరీ నరేందర్ నాయక్, నాయకులు డాక్టర్ దేవేజీ, డాక్టర్ భాగ్యమ్మ, డాక్టర్ వినోద, డాక్టర్ సుజాత, డాక్టర్ విజయ, డాక్టర్ సుధీర్, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ మాధవి, డాక్టర్ వాణిదేవి, డాక్టర్ సుజాత, డాక్టర్ సృజన, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ఫణి తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యాపారి మృతి

ఐనవోలు, మే 16: లారీ ఢీకొని యువ వ్యాపారి మృతి చెందిన సంఘటన పంథిని శివారు లక్ష్మీపురం స్టేజి వద్ద జాతీయ రహదారి(563)పై గురువారం తెల్లవారుజామున జరిగింది. ఎస్సై అనిల్ కుమార్ కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం సిరిసపల్లి గ్రామానికి చెందిన యువకుడు దిగ్గిశెట్టి వినయ్‌కుమార్(30) వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నివాసం ఉంటూ ఒక కంపెనీ (నిత్యావసర సరుకుల విక్రయ) ఏజెన్సీ డీలర్‌గా వ్యాపారం నిర్వహిస్తున్నాడు. 18 మాసాలుగా ఇల్లందలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ ఆయా మండలాల్లోని గ్రామాల్లో కిరాణం షాపులకు సరుకులు సరఫరా చేస్తున్నాడు. ఐదు రోజుల కిందట తన మేనత్త మృతిచెందగా ఐదో రోజు కార్యక్రమంలో పాల్గొనేందుకు స్వగ్రామానికి ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. వరంగల్ నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ అతివేగంగా ఎదురుగా వచ్చి అదుపుతప్పి వినియ్ కుమార్ బైక్‌ను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా అంబులెన్స్ ద్వారా ఎంజీఎంకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందాడు. వినయ్‌కుమార్ అవివాహితుడు, తల్లిదండ్రులు ఒక సోదరుడు, సోదరి ఉన్నారు. తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గ్రాండ్ టెస్ట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 16 : జిల్లాలోని గ్రూప్-1 (ప్రిలిమ్స్), సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్)-2024 పరీక్షకు హాజరయ్యే విద్యార్థినీ, విద్యార్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆఫ్‌లైన్ గ్రాండ్‌టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1 (ప్రిలిమ్స్) గ్రాండ్ టెస్టును హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఈనెల 18, 20, 22, 24, 25, 27, 29, 31, జూన్ 1, 3 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సివిల్ సర్వీస్ (ప్రిలిమ్స్)-2024 ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్టును ఈనెల 23, 26, 28, 30, జూన్ 10, 12 తేదీల్లో హైదరాబాద్‌లోని సైదాబాద్ స్టడీ సర్కిల్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్టుకు హాజరయ్యే ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఆసక్తి ఉన్న అభ్యర్థులు https:// studycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, 040- 27077929, 24071178 ఫోన్‌నెంబర్లలో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు

కేసముద్రం, మే 16 : మండలంలోని రంగాపురంలో రైతు అంకుస్‌అలీకి చెందిన దుక్కిటెద్దు గురువారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. తన చెల్కలో దుక్కిదున్ని తిరిగి ఇంటికి ఎద్దును తీసుకువస్తుండగా వస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపారు. మృతి చెందిన ఎద్దు విలువ రూ.70వేలు ఉంటుందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

నల్లెలలో ఆవు..


మృతి చెందిన పాడిఆవు

కురవి : మండలంలోని నల్లెలలో విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి చెందింది. బాధిత రైతు బండి సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం. మేత కోసం చేనుకు వెళ్తున్న ఆవుకు తెగిపడ్డ విద్యుత్ తీగెలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు మృతితో తనకు రూ.60 వేల నష్టం వాటిల్లిందని, అధికారులు ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశారు.

పిడుగు పాటుకు పాడి గేదె..


మృతి చెందిన పాడిగేదె

● బయ్యారం : ఉరుములు, మెరుపులతో దాదాపు రెండు గంటలపాటు వర్షం కురియడంతో ప్రజలకు ఇళ్లకే పరిమితమయ్యారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెంకట్రాంపురంలో పిడుగు పాటుకు జక్కుల తిరుపతయ్యకు చెందిన పాడిగేదె మృత్యువాత పడింది. సుమారు రూ.50 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు పేర్కొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సమాయత్తం

- బరిలో 52 మంది అభ్యర్థులు
- జిల్లాలో 34,933 మంది ఓటర్లు
- అత్యధికంగా మానుకోటలో 5,494, అత్యల్పం గంగారంలో 413
- 27న ఎలక్షన్ నిర్వహణకు 36 పోలింగ్ కేంద్రాలు


ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రానికి కేటాయించిన మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల

మహబూబాబాద్ టౌన్, మే16 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికకు జిల్లా యంత్రాంగం సమాయత్తమవుతోంది. రెండేళ్ల క్రితం నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల శాసన మండలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఐదునెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందాడు. దీంతో ఖాళీ అయిన ఆ ఎమ్మెల్సీ స్థానానికి ఎలక్షన్ కమిషన్ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయడంతో అభ్యర్థులు నల్లగొండ కలెక్టరేట్‌లో నామినేషన్లు వేశారు. ఈనెల 13తో ఉపసంహరణ గడువు ముగియడంతో 52 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ జరుగనుంది. సోమవారం లోక్‌సభ ఎన్నికల నిర్వహణ పూర్తి కాగానే, నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా జరిపించేందుకు సంబంధిత అధికారులు సిద్ధమవు తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటరు జాబితాను తయారు చేశారు. బ్యాలెట్ ద్వారా ప్రాధాన్యత క్రమంలో ఎమ్మెల్సీని ఎన్నుకోవాల్సి ఉంటుంది. ఈ క్రమంలో హైదరాబాద్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కార్యాలయం నుంచి రాష్ట్ర అడిషనల్ సీఈవో లోకేష్‌కుమార్ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకుని సమాయత్తం కావాలని ఆదేశించారు. దీంతో పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికకు జిల్లా యంత్రాంగం తయారు అవుతోంది.

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలోని నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలకు అధికారులు ఓటరు జాబితాను సిద్ధం చేశారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం ఓటర్లు 34,933 మంది ఉండగా.. అందులో పురుషులు 22,948 మంది, స్త్రీలు 11,985 మంది ఉన్నారు. జిల్లాలోని 18 మండలాల పరిధిలో ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు 36 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో మహబూబాబాద్ డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో 20,295 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 13,143 మంది, స్త్రీలు 7,152 మంది ఉండగా వారు ఓటు వేసేందుకు 21 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. తొర్రూరు డివిజన్‌లోని ఏడు మండలాల పరిధిలో 14,638 మంది ఓటర్లుండగా అందులో పురుషులు 9,805 మంది, స్త్రీలు 4,833 మంది ఉన్నారు. వారు ఓటు వేసేందుకు 15 పోలింగ్ కేంద్రా లను ఏర్పాటు చేశారు. పట్టభద్రుల ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఓటుహక్కు వినియోగించు కునేందుకు ఆయా పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతులు కల్పించడంతో పాటు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల అనంతరం జూన్ 5న నల్లగొండలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనుంది.

మండలం	పురుషులు	స్త్రీలు	మొత్తం ఓటర్లు	పోలింగ్ కేంద్రాలు
చిన్నగూడూరు	368	173	541	01
దంతాలపల్లి	908	444	1352	01
మరిపెడ	2615	1164	3779	04
నర్సింహులపేట	824	353	1177	02
నెల్లికుదురు	1396	618	2014	02
పెద్దవంగర	920	428	1348	01
తొర్రూరు	2774	1653	4427	04
గూడూరు	1329	609	1938	02
కేసముద్రం	1557	797	2357	02
మహబూబాబాద్	3345	2149	5494	05
డోర్నకల్	1281	746	2027	02
కురవి	1260	580	1840	02
బయ్యారం	1105	620	1725	02
గార్ల	1301	645	1946	02
కొత్తగూడ	651	410	1061	01
గంగారం	253	160	413	01
ఇనుగుర్తి	474	206	680	01
సీరోలు	587	230	817	01
మొత్తం	22,948	11,985	34,933	36

ప్రచార పర్వంలో పార్టీల అభ్యర్థులు..

నల్లగొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో పట్టభద్రుల ఓటర్లను మచ్చిక చేసుకుని విజయం సాధించేందుకు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచార పర్వంలోకి దిగారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ముందుగానే ప్రకటించడంతో పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్ కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి, మద్దతు కోరారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల జోష్‌తో ప్రచారంలో దూకుడు పెంచారు.

బీఆర్ఎస్ నుంచి ఏ.రాకేష్‌రెడ్డిని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అధికారికంగా ప్రకటించారు. ఈ నెల15న తెలంగాణ భవన్‌లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల బీఆర్ఎస్ ముఖ్యనేతలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమీక్షించి దిశానిర్దేశం చేశారు. గతంలో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సిట్టింగ్ సీటును ఎలాగైనా దక్కించుకోవాలనే దృఢసంకల్పంతో ముందుకు సాగాలని సూచించినట్లు తెలిసింది.

ఇక భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి గతంలో పోటీ చేసిన గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని మళ్లీ బరిలో నిలపారు. ఉమ్మడి నల్లగొండ, వరంగల్, ఖమ్మం జిల్లాలకు ఎన్నికల ఇన్‌చార్జ్‌లను ప్రకటించి, వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారానికి తొమ్మిది రోజులు మాత్రమే గడువు ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు ప్రచారంలో జోరు పెంచారు. ఎలాగైనా సీటును కైవసం చేసుకోవాలని ఆయా పార్టీల నేతలు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎంహెచ్‌వో


మానుకోటలోని అర్బన్ పీహెచ్‌సీలో మాట్లాడుతున్న కళావతి బాయి

నెహ్రూసెంటర్, మే 16 : డెంగీ జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి బి.కళావతి బాయి సూచించారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీలో గురువారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డెంగీ నివారణ కోసం ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే నీటినిల్వ ఉండకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో అంబరీష, నాగేశ్వర్‌రావు, రాంబాబు, విజయ్, శివ, కొప్పుల ప్రసాద్, మంగమ్మ, పురుషోత్తం, గోపిచంద్, వొబిలిశెట్టి రామకృష్ణ, రత్నకుమారి పాల్గొన్నారు.

● డోర్నకల్ : డెంగీ జ్వరాలు ప్రమాదకరమైనవని, దోమలతో వ్యాప్తి చెందుతాయని డోర్నకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యురాలు సాద్విజ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని డోర్నకల్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమలు దరిచేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● గార్ల : గ్రామాల్లో సీజనల్‌గా వచ్చే డెంగీ జ్వరాల పట్ల ప్రజలుఅప్రమత్తంగా ఉండాలని ముల్కనూరు పీహెచ్‌సీ వైద్యుడు నవీన్‌కుమార్ అన్నారు. డెంగీపై ముల్కనూరులో వైద్యసిబ్బంది, ఆశావర్కర్లతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో గ్రామపంచాయతీ సిబ్బంది పరిసరాలను పరిశుభ్రం చేస్తూ, రోజూ కాల్వల్లో బ్లీచింగ్ పౌడర్‌చల్లి క్లోరినేషన్ పనులను చేపట్టాలన్నారు. వైద్యసిబ్బంది సక్కుబాయి, బుజ్జమ్మ, పద్మ, కామేశ్వరి, సాదాలి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

● గూడూరు : ప్రతీ ఫ్రైడేను.. డ్రైడేగా పాటించాలని అయోధ్యపురం పీహెచ్‌సీ వైద్యాధికారి యమున అన్నారు. అయోధ్యపురంలోజాతీయ డెంగీనివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో పలు చోట్ల నీళ్లు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సీతమ్మ, లవ్వారం, లోక్యనాయక్, కోమల పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మే 16 : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు జూన్ 10 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 14 సంవత్సరాలు నిండి పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు https://iti.telangana.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఒరిజినల్ సర్టిఫికెట్లను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్, వెబ్ ఆప్షన్‌ల ద్వారా సీట్ల భర్తీ ఉంటుందన్నారు. వెరిఫికేషన్ ఫీజు గేట్‌వే లింక్‌ద్వారా ఆన్‌లైన్‌లో సమర్పించాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఎస్ఎంఎస్ ద్వారా రిజిస్టర్ చేసుకున్న మొబైల్ నెంబర్లకు సమాచారం అందించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని జిల్లాలోని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు మానుకోట ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించాలన్నారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర


బేరువాడలో శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ మాలధారులు

కేసముద్రం, మే 16 : మండలంలోని బేరువాడలో గురువారం హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. వాహనంలో హనుమాన్ విగ్రహం ఏర్పాటు చేసుకొని ఆంజనేయ భక్తి పాటలతో గ్రామమంతా ఈ శోభాయాత్ర కొనసాగింది. ఈ యాత్రలో మండలంలోని వివిధ గ్రామాల్లో హనుమాన్ మాలధారణ వేసిన వారితో పాటు మహిళలు మంగళహారతులతో పాల్గొనడంతో గ్రామంలో సందడిగా మారింది. స్వాములు పానుగంటి సుధాకర్, సంతోష్, దరావత్ భీమ, సురేష్, విజయ్‌కుమార్, చిట్టిమల్ల యాకయ్య, రాయబారపు శ్రీను పాల్గొన్నారు.

‘బోనస్‌పై రైతులను మోసం చేసిన సీఎం’


రాస్తారోకో నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ శ్రేణులు

కేసముద్రం, మే 16 : ధాన్యానికి క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి పార్లమెంటు ఎన్నికలు ముగిసిన వెంటనే కేవలం సన్నరకం వడ్లకే ఇస్తామంటూ రైతులను మోసం చేశారని మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ ఆరోపించారు. కేసముద్రం మార్కెట్ గేటు ఎదుట గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నిరకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నిరకాల ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే రెండు లక్షల రూపాయల రుణమాఫీ, ఆడపడుచులకు నెలకు రూ.2500, ఆసరా పింఛనుదారులకు నెలకు రూ.4 వేల పింఛను, కల్యాణలక్ష్మి పథకంలో నగదుతోపాటు తులం బంగారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని పక్షంలో ప్రతీరోజు ప్రభుత్వం వెంటపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల నాయకులు నీలం దుర్గేష్, పట్టణ అధ్యక్షుడు గుగులోత్ వీరునాయక్, కముటం శ్రీనివాస్, మోడెం రవీందర్‌గౌడ్, ఊకంటి యాకూబ్‌రెడ్డి, చిర్ర యాకాంతంగౌడ్, కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, శతకోటి నరేష్, బానోత్ వెంకన్న, మిట్టగడుపుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.


న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సరిత

రైతులకు చట్టాలపై అవగాహన ఉండాలి

● తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సరిత

నెల్లికుదురు, మే 16 : రైతులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు కోర్టు జూనియర్ సివిల్‌జడ్జీ మట్ట సరిత తెలిపారు. కాచికల్‌లో గురువారం మండల న్యాయసేవాధికార సంస్థ తొర్రూరు ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నదమ్ములు భూములు పంచుకున్న వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రసీదు తీసుకోవాలన్నారు. విత్తనాలు నాటేముందు గుప్పెడు విత్తనాలు తీసుకొని ఖాళీప్యాకెట్, రషీదును భద్రపరుచుకోవాలన్నారు. నకిలి విత్తనాలు విక్రయిస్తే కోర్టును ఆశ్రయించాలన్నారు. రైతులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే మోసాలనుంచి తప్పించుకోవచ్చన్నారు. బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరి ఘనపురం రామకృష్ణ, ఎస్సై క్రాంతికిరణ్, వ్యసాయ అధికారి నెలకుర్తి రవీందర్‌రెడ్డి, బార్ అసోషియేషన్ సభ్యులు బండపెల్లి వెంకన్న, షైలపాక అశోక్, గంపల ప్రవీణ్, పాల్గొన్నారు.

‘భూమి ఆక్రమించుకున్న వారిపై చర్య తీసుకోవాలి’

నెల్లికుదురు, మే16 : రామన్నగూడెంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని అక్రమకట్టడాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు తహసీల్దార్ కె.రాజుకు గురువారం వినతి అందజేశారు. అనంతరం గ్రామస్థులు మాట్లాడుతూ రామన్నగూడెం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సర్వేనెంబర్ 62లో 4 గుంటల భూమిని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని, అతడిపై చర్యలు తీసుకొని అక్రమకట్టడాలను తొలగించాలన్నారు. 1998లో 3 ఎకరాల ప్రభుత్వ భూమిలో 60 మంది గ్రామస్థులకు ఇండ్లస్థలాలకు పట్టాలు ఇచ్చారని పొజిషన్ చూపించకపోవడంతో ఇండ్లు నిర్మించుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అక్రమ కట్టడాలను తొలగించి లబ్ధిదారులకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు ఆకుతోట సోమనర్సయ్య, బండి సోమయ్య, మైస అంజయ్య, మైస అబ్బయ్య, మైసరాములు, ఆది కొమురయ్య, చిలుకలపెల్లి వీరస్వామి, గుండ భిక్షపతి, కొంతం వెంకన్న, గాజుల బ్రహ్మం పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సోషల్ మీడియా కన్వీనర్


సీఎంను కలిసిన కాంగ్రెస్ పార్టీ గార్ల మండల సోషల్ మీడియా కన్వీనర్ నవీన్‌యాదవ్

గార్ల, మే 16 : హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఓ ఫంక్షన్‌హాల్లో రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ గార్ల మండల సోషల్‌మీడియా కన్వీనర్ గుడిచుట్టు నవీన్ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గార్ల మండలంలో కాంగ్రెస్ పార్టీ పటిష్టత, నాయకుల పనితీరును సమావేశంలో వివరించారు.

‘అమరుల ఆశయ సాధన కోసం ఉద్యమించాలి’

కేసముద్రం, మే 16 : విప్లవోద్యమంలో అమరులైన నేతల ఆశయ సాధన కోసం ఉద్యమిస్తేనే వారికి అసలైన నివాళులని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు శివ్వారపు శ్రీధర్ అన్నారు. కేసముద్రంలో గురువారం దివంగత ఎన్డీ నేతలు బోగ శ్రీరాములు, మారోజు వీరన్నల వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విప్లవోద్యమానికి శ్రీరాములు, వీరన్న మర్చిపోలేని మైలురాయిలాంటి వారని కొనియాడారు. వారి ఆశయాలను సాధించేందుకు ఉద్యమాలను కొనసాగిస్తామని తెలిపారు. సబ్ డివిజన్ నాయకుడు భట్టు నాగేశ్వర్‌రావు, మిట్టగడుపు వెంకన్న, బట్టమేకల రాజు, బండి రాజు, ఎండీ జిలాని, సకినాల ఐలయ్య, నూకల లింగస్వామి, నరేష్, డి.రాజు, రామయ్య, వీరయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

‘ఆదర్శ కమ్యూనిస్టు బోగ శ్రీరాములు’

మహబూబాబాద్ రూరల్, మే 16 : ఉమ్మడి వరంగల్ జిల్లా విప్లవోద్యమంలో ప్రజాసేవ చేసిన బోగ శ్రీరాములు ఆదర్శ కమ్యూనిస్టు అని సీపీఐ (ఎంఎల్) మాస్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి కొనియాడారు.. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం బోగ శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంలో శ్రీరాములు ముందుండేవాడన్నారు. ఈ కార్యక్రమంలో బిల్లకంటి సూర్యం, పైండ్ల యాకయ్య, ఉమగాని సత్యం, జక్కుల యాకయ్య, రాజు, మల్లయ్య వెంకట్, సత్తెమ్మ పాల్గొన్నారు.

● నెల్లికుదురు : బోగ శ్రీరాముల ఆశయాలకోసం పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు ఆలకుంట్ల సాయిలు తెలిపారు. నెల్లికుదురులో శ్రీరాములు వర్ధంతి నిర్వహించారు. శ్రీరాములు చిత్రపటానికి పూల మాలవేసి, నివాళులు అర్పించారు. జాటోత్ భిక్షపతి, నాగెల్లి సంజీవ, రాములు రాజు పాల్గొన్నారు.

మాధవన్న ఆశయసాధనకు కృషి చేయాలి

మహబూబాబాద్ రూరల్, మే 16 : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బోగ శ్రీరాములు అలియాస్ మాధవన్న ఆశయసాధన కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని ఎన్డీ రాష్ట్ర నాయకుడు మండల వెంకన్న అన్నారు. బోగ శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని భట్టు అంజయ్య భవనంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మండల వెంకన్న మాట్లాడుతూ ఆదివాసీ హక్కుల కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. తెల్లబోయిన లక్ష్మయ్య, హలావత్ లింగన్న, సామ పాపయ్య పర్వత కోటేష్, తెల్లబోయిన కృష్ణ, కవిత, కల్పన, ఉప్పలయ్య, సురేష్, లింగయ్య, రాంమ్మూర్తి, నాగరాజు, వేణు పాల్గొన్నారు.

డబుల్ రోడ్డు పనులను నిలిపివేయాలి

గార్ల, మే 18 : మండల కేంద్రం నుంచి చిన్న బంజరతండా వరకు రూ.14 కోట్లతో నిర్మాణంలో భాగంగా మిషన్ భగీరథ పైపులైన్లు దెబ్బ తినకుండా రోడ్డు పనులను చేపట్టాని సీపీఎం మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్ కోరారు. గురువారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ పైపులపై డబుల్ రోడ్డు పనులను నిలిపివేయాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టి, ఎంపీడీవో మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారుల పర్యవేక్షణలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. భూక్యా హరినాయక్, వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, గోవిందు, నాగమణి, భాగం లోకేశ్వరరావు, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న గెలుపు ఖాయం : సీపీఐ

మరిపెడ రూరల్, మే 16 : వరంగల్-ఖమ్మం- నల్లగొండ జిల్లాల ఉప ఎన్నికలో తీన్మార్ మల్లన్న అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమని సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ అన్నారు. గురువారం చిల్లంచర్ల, రాంపూర్, నీలికుర్తి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టభద్రులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసినట్లయితే శాసనమండలిలో మాట్లాడి ప్రభుత్వాన్ని ఒప్పించే సత్తా ఉందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గుండగాని వేణుగౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మండల కోఆప్షన్ సభ్యుడు

చిన్నగూడూరు, మే 16 : మండల కోఆప్షన్ సభ్యుడు మీర్జా మోసిన్‌బేగ్ గురువారం మండలకేంద్రంలోని రాంరెడ్డి నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రావుల రాంరెడ్డి, ప్రమోద్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేయస్సు అభ్యున్నతి కొరకు విద్యావంతులు రావాల్సిన అవశ్యకత ఉందని, పార్టీ కోసం కష్టపడ్డవారికి గుర్తింపు ఉంటుందని అన్నారు. అనంతరం తీన్మార్ మల్లన్న ప్రచార కమిటీ ఎన్నికను డోర్నకల్ తీన్మార్ మల్లన్న కన్వీనర్ గుండగాని వేణు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా దుండి వెంకన్న, గాడిపెల్లి జీవన్, దాసరి రాజు, సీహెచ్.యాకన్న, నాగెల్లి గౌతమ్, భూక్య సందీప్ ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ పిల్లి వీరన్న, మండల ప్రధాన కార్యదర్శి నాగేష్, డొంగరి నర్సయ్య, రమేష్, నాగేష్ ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు షురూ

తొర్రూరు, మే 16 : తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 సంవత్సరానికి దోస్త్ విధానంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ బి.రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బీఎస్సీ డైరీ, సెరికల్చర్, జనరల్ కంప్యూటర్, బీకామ్ కంప్యూటర్, ఫిజికల్ సైన్స్‌లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, అడ్మిషన్ల కోసం విద్యార్థులు పదో తరగతి, ఇంటర్ మెమో, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ జిరాక్స్, రెండు పాస్ ఫోటోలు, ఆధార్ కార్డు లింక్ మొబైల్ నంబర్‌తో కళాశాలలో, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. డిగ్రీ అడ్మిషన్ పొందాలనుకునే విద్యార్థులు పూర్తి వివరాలకు 9989749066 నంబరులో సంప్రదించాలన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలి

తొర్రూరు, మే 16 : నేటికి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాటాలు చేపట్టాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. గురువారం ఆదర్శ కమ్యూనిస్టు మాధవన్న 21వ వర్ధంతి సందర్భంగా తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం పోరాడిన వ్యక్తి అని, ఉన్నత విద్యావంతుడైన మాధవన్న వరంగల్ జిల్లాలో సుదీర్ఘ కాలం పనిచేశాడన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చింత నవీన్, అనిల్, యాకయ్య, మధు, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

‘వీరన్న ఆశయాలను కొనసాగించాలి’

కొత్తగూడ, మే 16 : గోదావరి లోయ ప్రతిఘటన యోధులు మాధవన్న, బోగ శ్రీరాములు, సీపీయూఎస్ఐ కార్యదర్శి మారోజు వీరన్న ఆశయాలను సాధించాలని ఎన్డీ సబ్ డివిజన్ నాయకుడు గజ్జి సోమన్న పిలుపునిచ్చారు. కొత్తగూడలోని పాలడుగు కృష్ణ స్మారక భవనంలో మాధవన్న, బోగ శ్రీరాములు, మారోజు వీరన్న వర్ధంతిని గురువారం ఎన్డీ నాయకులు నిర్వహించారు. ఎన్డీ నాయకులు పిట్టల దేవేందర్, శ్రీశైలం, జములు, రవి, పూర్ణచందర్, రాంచందర్, రాంబాబు, ప్రభాకర్, లక్ష్మయ్య, రాజమల్లు, రాంరెడ్డి, సదయ్య, నర్సయ్య, సురేందర్ పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

డోర్నకల్, మే 16 : మండలంలోని లింబ్యాతండా గ్రామపంచాయతీలో బుధవారం రాత్రి శ్రీవేంకటేశ్వరస్వామి (రాంసింగ్ బాబా) బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామస్తులు వేంకటేశ్వరస్వామి-రాజమాత కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు మాన్‌సింగ్ మాట్లాడుతూ గురువారం సాయంత్రం ఆలయం చుట్టు ప్రభబండ్ల ప్రదర్శన నిర్వహించారు. శుక్రవారం ఆలయపరిసరాల్లో మల్సూర్‌స్వామి దర్గా వద్ద కందురులు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. శుక్రవారం జరిగే జాతరకు డోర్నకల్, కామేపల్లి, కురవి, తిరుమలాయపాలెం, రఘునాథపాలెం,ఇల్లందు, మరిపెడ, ఏన్కూరు మండలాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు.